సాక్షి మెదక్

గురువారం । 29 । మే । 2025



పొదుపే ఇం'ధనం'

పోస్టాఫీస్ ద్వారా పేద, మధ్య తరగతి వారికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతున్నాయి.

వివరాలు 8లో ▸



పిడుగులతో జాగ్రత్త

వానాకాలంలో పిడుగులు ఎక్కువగా పడే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

వివరాలు 8లో ▸



కనిపించని మరుగుదొడ్లు

పంచాయతీలతో పాటు మండల కార్యాలయాల్లో మరుగుదొడ్లు కరువయ్యాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

జూన్ 3 నుంచి రెవెన్యూ సదస్సులు

నర్సాపూర్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ మహిపాల్ రైతులకు సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు డివిజన్ పరిధిలో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. సదస్సులకు తహసీల్దార్లు హాజరై అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను సదస్సుల్లో అధికారుల దృష్టికి తేవాలని సూచించారు.

నాణ్యమైన విత్తనాలు అమ్మాలి



మన గ్రోమోర్ కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని ఏడీఏ పుణ్యవతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మన గ్రోమోర్, ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంతో పాటు పలు ఎరువుల దుకాణాల్లో ఏఓ స్వప్న, ఎస్ఐ రంజిత్‌రెడ్డితో కలిసి తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, ఎరువులతో పాటు కంపెనీ, లాట్ నంబర్, స్టాక్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని నిర్వాహకులను ఆదేశించారు. ప్రభుత్వం నిషేధించిన విత్తనాలు, పురుగు, గడ్డి మందు అమ్మవద్దని చెప్పారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి బ్యాచ్, లాట్ నంబర్ ఉన్న రసీదు ఇవ్వాలన్నారు. కల్తీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అర్హత ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక

మెదక్ కలెక్టరేట్: అర్హత ఆధారంగా రాజీవ్ యువ వికాసం పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. పథకం కింద వచ్చే సహాయంతో యువత వ్యాపారం చేసి ఉపాధి పొందేలా ఎంపిక చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

నర్సాపూర్: నాబార్డు ఆధ్వర్యంలో మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు తెలిపారు. బుధవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సిబ్బందితో ఆయన ఉచిత శిక్షణపై సమీక్ష నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండి 45 ఏళ్లలోపు ఉన్న మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తారని చెప్పారు. ఆసక్తి ఉన్న మహిళలు ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ మొదటివారంలో శిక్షణ ప్రారంభమయ్యే అవకాశం ఉంటుందని కమిషనర్ వివరించారు. అభ్యర్థులు పదో తరగతి చదివి ఉండాలని, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను తమ కార్యాలయంలోని మెప్మా సిబ్బందికి అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా మెప్మా పీడీ ఇందిర, కోఆర్డినేటర్ దేవపాల తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

రామాయంపేట(మెదక్): ప్రపంచ పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం రోడ్ల పక్కన పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను అటవీ సిబ్బంది తొలగించారు. అక్కన్నపేట బీట్ పరిధిలోని రోడ్డు పక్కన బాటసారులు వేసిన ప్లాస్టిక్ సీసాలను తొలగించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రేంజ్ అధికారి విద్యాసాగర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దారంతా పూలవనం



నర్సాపూర్– వెల్దుర్తి రహదారికి ఇరువైపులా గుల్‌మొహర్ చెట్లు ఎర్రటి పూలతో ప్రయాణికులను ఆహ్లాదపరుస్తున్నాయి. 2017లో అటవీశాఖ అధికారులు నర్సాపూర్ నుంచి నారాయణపూర్ వరకు గుల్‌మొహర్ మొక్కలు నాటి సంరక్షించారు. ఏపుగా పెరిగిన ఎర్రటి పూల చెట్లు ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులను కనువిందు చేస్తూ కట్టి పడేస్తున్నాయి.

– నర్సాపూర్ రూరల్

అన్నదాత ఆగం



ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాత అరిగోస పడుతున్నాడు. తూప్రాన్ పట్టణంలోని కొనుగోలు కేంద్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు వడ్లు తడిసి మొలకెత్తాయి. ఎన్నో ఆశలతో పంటను అమ్ముకుందామని కేంద్రానికి తీసుకువస్తే చివరకి కన్నీళ్లే మిగిలాయని రైతు కృష్ణ ఆవేదన వ్యక్తం చేశాడు.

– తూప్రాన్

మసక చీకట్లో ఇసుక దోపిడీ!



పొలాల్లో ఇసుక కుప్పల నిల్వలు

పాటిగడ్డ కేంద్రంగా ఆగని దందా

రాత్రి 3 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు రవాణా

గాడిద కష్టం.. దళారుల అదృష్టం! ● సీజ్ చేసిన ఇసుక కుప్పలు మాయం

పాపన్నపేట(మెదక్): గాడిద కష్టం.. దళారుల అదృష్టం అన్నట్లుంది ఇసుకాసురుల తిరకాసు దందా. జల వనరులను పరిరక్షించాల్సిన ఖద్దరు నాయకులే మంజీరా పాలిట జలగల్లా మారారన్న ఆరోపణలున్నాయి. స్థలం మార్చి.. అధికారులను ఏమార్చి మంజీరా నదిని ఎడారిగా మార్చే యత్నం చేస్తున్నారు. రాత్రి 3 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు దర్జాగా దందాను కొనసాగిస్తున్నారు. యూసుఫ్‌పేట శివారులోని పాటిగడ్డ కేంద్రంగా గాడిదలపై సాగుతున్న ఇసుక రవాణా దళారులకు కాసుల వర్షం కురిపిస్తుంది.



యూసుఫ్‌పేట శివారులోని పాటిగడ్డ వద్ద గాడిదలపై ఇసుక తరలింపు

ఖద్దరు బట్టల చాటున వ్యాపారం

వేసేది తెల్లబట్టలు.. చేసేది చీకటి వ్యాపారం అన్నట్లుంది ఇసుక అక్రమ దందా తీరు. పాపన్నపేట మండలం చుట్టూ మంజీరా నది ఉండటంతో వర్షాకాలంలో భారీగా ఇసుక మేటలు పెడతాయి. దీంతో వేసవి రాగానే అక్రమార్కులు ఇసుక దందాకు తెరలేపుతారు. గతంలో ట్రాక్టర్లపై ఇసుక రవాణా చేసేవారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు కేసులు నమోదు చేస్తుండడంతో ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ప్రస్తుతం గాడిదలపై ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 6 వేలు వస్తుండటంతో ప్రధాన పార్టీల నాయకులు ఇసుక దందాలో పాలుపంచుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అధికారుల మొక్కుబడి దాడులు

పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు మాత్రమే పోలీస్, రెవెన్యూ అధికారులు దాడులు చేసి డంపులు సీజ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. సీజ్ చేసిన ఇసుక కుప్పలకు ఓపెన్ టెండర్ నిర్వహించి, డబ్బులను డిపాజిట్ చేయాలి. కాని అవేవి చేయకపోవడంతో గతంలో సీజ్ చేసిన ఇసుక కుప్పలను అక్రమార్కులు యథేచ్ఛగా కొల్లగొట్టారన్న ఆరోపణలున్నాయి. ఒక వేళ టెండర్లు నిర్వహించినా, లోలోపల తతంగం అయిందనిపించి దళారులే వాటిని మొక్కుబడి ధరలకు సొంతం చేసుకుంటున్నారు. ప్రస్తుతం పాటిగడ్డ ఇసుక దిబ్బగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల అధికారులు గాడిదల యజమానులను అక్కడి నుంచి కుర్తివాడకు తరలించగా, యూసుఫ్‌పేట వ్యాపారులు తిరిగి వారిని రప్పించుకున్నట్లు తెలుస్తుంది. ఈ విషయమై తహసీల్దార్ సతీష్ కుమార్‌ను వివరణ కోరగా.. పాటిగడ్డపై నిఘా పెట్టి ఇసుక అక్రమ రవాణా అడ్డుకొని, కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

స్థలం మార్చి.. అధికారులను ఏమార్చి

యూసుఫ్‌పేట శివారులోని పాటిగడ్డ ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణాపై ఇటీవల 'సాక్షి'లో కథనాలు రావడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు దాడులు చేసి ఇసుక కుప్పలను సీజ్ చేశారు. దీంతో దళారుల కన్ను సంగమేశ్వర్‌రెడ్డి పొలం దగ్గర గల పాటిగడ్డపై పడింది. అక్కడ నాణ్యమైన ఇసుక ఉండటంతో నదిలోకి ప్రత్యేక రోడ్డు వేశారు. గ్రామీణ స్థాయి నుంచి మండల స్థాయి వరకు గల కొందరు ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు గాడిదలపై ఒడ్డు వరకు ఇసుక తరలిస్తున్నారు. అక్కడి నుంచి సమీప పొలాల వరకు ట్రాక్టర్లపై రవాణా చేసి, అక్కడ నిల్వ చేస్తున్నారు. ఇందుకు గాను గాడిదల యజమానులకు రూ. 1,500, ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేసే లేబర్‌కు రూ. 500 చెల్లిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 5,500 నుంచి రూ. 6 వేల వరకు బయట అమ్ముకుంటున్నారు.

చివరి గింజ వరకు కొంటాం

కలెక్టర్ రాహుల్‌రాజ్



దండుపల్లిలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

రామాయంపేట(మెదక్)/తూప్రాన్/మనోహరాబాద్/చేగుంట: కలెక్టర్ రాహుల్‌రాజ్ బుధవారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించడంతో పాటు ఎరువులు, విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. మనోహరాబాద్ మండలంలోని దండుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోళ్లు పూర్తి చేసేలా చొరవ చూపించాలని నిర్వాహకులను ఆదేశించారు. ముందస్తు వర్షాలతో ధాన్యం సేకరణలో ఇబ్బందులు తలెత్తున్నాయని తెలిపారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తూప్రాన్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్మించిన ఇందిరమ్మ ఇంటి నమూనాను పరిశీలించారు. జిల్లాలో 9 వేల మంది ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించామన్నారు. ఎంపీడీఓ భవనం కోర్టు నిర్వహణకు అనుకూలంగా ఉందని, ఎంపీడీఓ కార్యాలయాన్ని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కొనసాగించేందుకు ఉన్నతాధికారులతో చర్చించి త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే చేగుంటలో ఓ ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు వానాకాలం సీజన్‌కు సంబంధించి ఎరువులు, విత్తనాలకు ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వ్యవసాయ, పోలీస్‌శాఖల సమన్వయంతో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం రామాయంపేటలో పర్యటించారు. మల్లె చెరువులోకి మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన మినీ ట్యాంక్ బండ్ పనులను పరిశీలించారు. చెరువు సుందరీకరణకు మంచి అవకాశం ఉందని, ఈమేరకు అధికారులు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఆయన వెంట వివిధశాఖల అధికారులు, నాయకులు ఉన్నారు.

బోధనలో సాంకేతికతను జోడించాలి

డీఈఓ రాధాకిషన్



సాంకేతిక బోధనను పరిశీలిస్తున్న డీఈఓ

మెదక్ కలెక్టరేట్: విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెంచేలా బోధనలో సాంకేతికతను జోడించాలని డీఈఓ రాధాకిషన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రెండో విడత భౌతిక, రసాయనశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఈఓ ఆకస్మికంగా సందర్శించి పలు సూచనలు చేశారు. అన్ని పాఠశాలల్లో ఐఎఫ్‌టీ ప్యానల్స్ అందుబాటులో ఉన్నందున, ఏఐ సాంకేతికతను ఉపయోగించి బోధించాలని సూచించారు. రిసోర్స్‌పర్సన్ సొంతంగా తయారు చేసిన బోధన అభ్యసన సామగ్రిని పరిశీలించారు. ఉపాధ్యాయులు కూడా ఇదే విధమైన బోధన అభ్యసన సామగ్రిని రూపొందించుకొని బోధించాలన్నారు. ప్రయోగాలు, కృత్యాలను వీడియో ద్వారా చిత్రీకరిస్తూ నేరుగా ఐఎఫ్‌టీ ప్యానల్స్‌లో వీక్షించే విధంగా సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉందన్నారు. ఉపాధ్యాయులంతా దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతకుముందు డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, కోర్స్ కోఆర్డినేటర్ రేఖ, రిసోర్స్ పర్సన్లు రాజ్‌కుమార్, మహేందర్, వెంకటరమణ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు



కరపత్రాలతో అధికారులు, రైతులు

నర్సాపూర్ రూరల్: రైతులు నూతన సాంకేతిక పద్ధతులను అందిపుచ్చుకొని వ్యవసాయం చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ గీత, పద్మశ్రీ, గాయత్రి, శ్రీలత సూచించారు. బుధ వారం మండలంలోని నత్నయ్యపల్లి, అహ్మద్‌నగర్ గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొని సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు పంటలు సాగు చేసే ముందు తమ భూముల్లో భూసార పరీక్షలు చేయించుకొని రిపోర్టు ఆధారంగా అనువైన పంటలను సాగు చేసుకోవాలన్నారు. రసాయన ఎరువులకు దూరంగా ఉండి సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేసుకోవాలని తెలిపారు. ప్రతి రైతు తమ వివరాలు అందించి ఐడీ కార్డు పొందాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని దీపిక, ఏఈఓలు చంద్రవేణి, తేజస్విని, రైతులు పాల్గొన్నారు.



కొండపోచమ్మ బాగుంది

కోల్ ఇండియా ఉద్యోగుల బృందం కితాబు

కొండపోచమ్మ సాగర్ వద్ద కోల్ ఇండియా ఉద్యోగుల బృందం

మర్కూక్(గజ్వేల్): మర్కూక్ మండల కేంద్రంలోని కొండపోచమ్మ సాగర్‌ను బుధవారం కోల్ ఇండియా ఉద్యోగుల బృందం సందర్శించింది. ప్రాజెక్టు నిర్మాణం, అమలు చేసిన సాంకేతికత, ప్రాజెక్టు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాల గురించి ఏఈఏలు శ్రీనివాస్, శుశాంత్.. బృందం సభ్యులకు వివరించారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగిన తీరును, ప్రస్తుతం రైతుల పంట పొలాలకు కాల్వల ద్వారా నీటిని ఏ విధంగా వదులుతున్నామనే విషయాలను వారికి తెలిపారు. కొండపోచమ్మ సాగర్ నిర్మాణం బాగుందని వారు కితాబిచ్చారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో బాల్య వివాహాలు, అక్రమ దత్తత, బాలలపై అఘాయిత్యాలను అరికట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బాల సదనానికి చెందిన 13 ఏళ్ల పాపను కేంద్ర ప్రభుత్వ (కారా) మార్గదర్శకాల ప్రకారం పుదుచ్చేరికి చెందిన దంపతులకు అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లలను ఎవరైనా దత్తత తీసుకోవాలంటే జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారిని సంప్రదించాలని సూచించారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా సంక్షేమ అధికారిని హైమావతి తదితరులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధర పెంపు

జహీరాబాద్: కేంద్ర ప్రభుత్వం 2025–26 ఖరీఫ్ సీజన్‌కు గాను పలు రకాల పంటల కనీస మద్దతు ధరను పెంచింది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. జిల్లాలో రైతులు ప్రధానంగా పత్తి, కంది, సోయాబీన్, మొక్కజొన్న, మినుము, పెసర, వరి, జొన్న పంటలను అధిక విస్తీర్ణంలో పండిస్తారు. ప్రభుత్వం కనీస మద్దతు ధరను పెంచడంతో ఆయా పంటలను సాగు చేస్తున్న అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన ధరలు ఇలా (క్వింటాల్‌కు)

పంట	పెంచిన ధర	లభించనున్న ధర
వరి	రూ.69	రూ.2,369
జొన్నలు	రూ.328	రూ.3,699
సజ్జలు	రూ.130	రూ.2,775
రాగులు	రూ.596	రూ.4,886
వేరుశనగ	రూ.480	రూ.7,263
మొక్కజొన్న	రూ.175	రూ.2,400
కంది	రూ.450	రూ.8,000
పెసర	రూ.86	రూ.8,768
మినుము	రూ.400	రూ.7,800
పొద్దుతిరుగుడు	రూ.441	రూ.7,721
సోయాబీన్	రూ.436	రూ.5,328
పత్తి	రూ.589	రూ.8,110

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

తూప్రాన్: చండీఘడ్‌లో గురువారం నుంచి జరగనున్న 43వ జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ గుప్త తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14వ తేదీ నుంచి 24 వరకు మనోహరాబాద్‌లో జరిగిన తెలంగాణ బాలికల శిక్షణ శిబిరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్తీక, జిల్లాలో ఇటీవల జరిగిన బాలుర జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రామ్‌చరణ్, నందులాల్, సుమన్ రాష్ట్ర బాల, బాలికల తుది జట్టుకు ఎంపికైనట్లు వివరించారు.

ఐటీఐకి అడుగులు పడేనా?

పారిశ్రామికవాడలో ఏర్పాటుకు గతంలోనే హామీ



పరిశ్రమలవాడలో ఏర్పాటైన పరిశ్రమలు



కాళ్లకల్ పరిశ్రమలవాడ పైలాన్

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్, కూచారం, జీడిపల్లి, ముప్పిరెడ్డిపల్లి, కొండాపూర్ గ్రామాల్లో పరిశ్రమల వాడలు ఏర్పాటయ్యాయి. కాగా ఇక్కడి యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించడం లేదు. ఉన్నత విద్యే కాకుండా సాంకేతిక విద్య కలిగిన వారికి పరిశ్రమల్లో ఎన్నో అవకాశాలు లభిస్తున్నాయి. అయితే అందుబాటులో ఐటీఐ కళాశాల లేకపోవడంతో స్థానిక విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఐటీఐ ఏర్పాటుకు బాటలు వేయాలని పలువురు కోరుతున్నారు. కాగా పరిశ్రమల వాడ ఏర్పాటుకు రైతుల నుంచి భూములు సేకరించే సమయం (2007)లో అప్పటి భారీ పరిశ్రమల శాఖ మంత్రి గీతారెడ్డి ఇంటికి ఒకరి చొప్పున ఉపాధి కల్పిస్తామని, ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయించి స్థానికులకు సాంకేతిక విద్యనందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ పరిశ్రమల ఏర్పాటుపై పెట్టిన దృష్టి యువత ఉపాధిపై పెట్టలేదని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మనోహరాబాద్ మండల నేత ర్యాకల హేమలత జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఆమె సైతం ఐటీఐ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చి ఏర్పాటు చేయలేకపోయారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో స్థానికుల్లో ఆశలు చిగురించాయి. ప్రజాప్రతినిధులు దృష్టి సారించి యువతకు ఉపాధి కల్పించేలా ప్రణాళికలు రచించి అందుబాటులో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

> **స్థల సేకరణకు కృషి చేశాం**
>
> ముప్పిరెడ్డిపల్లి శివారులో గల పరిశ్రమల వాడలో కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వ భూమి గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఫైల్ పైస్థాయిలో ఉండగా, ప్రభుత్వం మారింది. దీంతో ఐటీఐ ఏర్పాటుకు బ్రేక్ పడింది.
>
> – హేమలత, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్

క్లుప్తంగా

అథ్లెటిక్స్‌తో ఉజ్వల భవిష్యత్



పోటీల్లో పాల్గొన్న బాలికలు

సిద్దిపేటజోన్: అథ్లెటిక్స్‌తో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా క్రీడాశాఖ అధికారి వెంకట్ నర్సయ్య పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అండర్ 8,10,12 విభాగాల్లో బాలబాలికలు, కిడ్స్‌కు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అథ్లెటిక్స్‌కు మంచి గుర్తింపు ఉందన్నారు.జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన 17 మంది చిన్నారులు జూన్ 1 నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట్ స్వామి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ప్రవీణ్, మాజీ ఎస్జీఎఫ్ జిల్లా సెక్రటరీ రామేశ్వర్ రెడ్డి, మోటివేషన్ స్పీకర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి చెక్కు అందజేత



కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు శాలరీ ప్యాకేజీ కింద అందాల్సిన రూ.కోటి చెక్కును సీపీ అనురాధ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గతేడాది డిసెంబర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్ర బోస్, పోలీసు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్‌పై నిఘా పెంచాలి

గంజాయి, డ్రగ్స్‌పై మరింత నిఘా పెంచాలని సీపీ అనురాధ పోలీసు అధికారులకు సూచించారు. పెండింగ్ కేసులపై పోలీసు అధికారులతో సీపీ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గంజాయి రహిత జిల్లాకు కృషి చేయాలన్నారు. ప్రో యాక్టీవ్ పోలీసింగ్‌పై దృష్టి సారించాలన్నారు. కేసుల్లో పరిశోధన పారదర్శకంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. దొంగతనాలు, పాత నేరస్థులపై నిఘా ఉంచి కేసులను ఛేదించాలని సూచించారు. మీ సేవ ద్వారా దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. జూన్ 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో గుర్తించిన కేసులను పరిష్కరించాలన్నారు.

లేగ దూడను ఎత్తుకెళ్లిన చిరుత

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లి తండా సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద పశువుల పాక నుంచి చిరుత లేగ దూడను ఎత్తుకెళ్లిందని గిరిజనులు తెలిపారు. మంగళవారం రాత్రి మిర్జాపల్లి తండా సమీపంలో పొలం వద్ద పశువులను కట్టేసిన రైతు కొడవత్ కిషన్ ఇంటికొచ్చాడు. రాత్రి సమయంలో వచ్చిన చిరుత లేగదూడను ఎత్తుకెళ్లిందని, లేగ దూడ రక్తం మరకలు, సమీపంలోని గుట్ట వరకు లాక్కుపోయిన గుర్తులు ఉన్నాయని తెలిపారు. ఇదే విషయం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి పరిశీలించారు. కచ్చితంగా చిరుత పనేనా లేదా మరే ఇతర అటవీ జంతువా అని పరిశీలిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హవేళిఘణాపూర్(మెదక్): పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ సత్యనారాయణ కథనం మేరకు.. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన నార్ల బాలయ్య(40) పొలం వద్దకు వెళ్లి 24న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంగళవారం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పొదుపే ఇంధనం



- రేపటి కోసం పొదుపు అవసరం
- పోస్టాఫీసుల్లో పేద, మధ్య తరగతి వారికి మంచి పాలసీలు
- తక్కువ ప్రీమియంతో ఎక్కువ ఉపయోగాలు
- స్మార్ట్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్ సేవలు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోస్టాఫీసు అధికారులు (ఇన్‌సెట్లో) సంగారెడ్డిలోని పోస్టాఫీస్

సంగారెడ్డి టౌన్: చిన్న మొత్తం పొదుపుతో పెద్ద లాభాలను అందజేస్తూ పోస్టాఫీసు ద్వారా పేద, మధ్య తరగతి వారికి ఎన్నో రకాల ప్రయోజనాలు చేకూరుస్తున్నారు. చిరు వ్యాపారం.. కూలీ, ఇతర పనులు చేసుకునే ప్రజల కోసం వివిధ రకాల పెట్టుబడి, పొదుపు అవకాశాలను పోస్టాఫీసు అందిస్తుంది. ఈ పథకాలు ముఖ్యంగా చిన్న మొత్తాల పెట్టుబడి కోసం, భద్రత కోసం.. మంచి వడ్డీ రేట్లను అందించడం కోసం ఉపయోగపడుతాయి. పోస్టాఫీసు పథకాలు లాభదాయకమైన పెట్టుబడి అవకాశాలను అందిస్తూ ప్రభుత్వ మద్దతుతో పెట్టుబడిదారులకు భద్రతను అందిస్తున్నాయి.

పోస్టు ఇన్ఫో యాప్

మార్కెట్‌లో పెరుగుతున్న పోటీని తట్టుకుంటూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంపై పోస్టాఫీస్ శాఖ దృష్టి సారించింది. శాఖ ఆధ్వర్యంలో అందించే సేవలను ఆన్‌లైన్ విధానంలోకి తీసుకురావడం విశేషం. మరోవైపు పోస్టు ఇన్ఫో పేరిట యాప్ ప్రవేశపెట్టింది. రెండేళ్ల కిందట దీన్ని తీసుకురాగా, ఇటీవల మరికొన్ని సేవలను ఇందులో జతచేశారు. అరచేతిలో ఉండే మొబైల్ నుంచే సేవలను పొందవచ్చు. ఇందుకు మనం చేయాల్సిందల్లా యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవడమే.

బీమా పాలసీలు

పేద, మధ్య తరగతి వారికి అందుబాటులో ఉండేలా పోస్టాఫీసులో గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీని ప్రవేశ పెట్టారు. రూ.599 ప్రీమియంతో రూ.10 లక్షలు, రూ.799 ప్రీమియంతో రూ.15 లక్షలు బీమా పాలసీలను అందుబాటులోకి తెచ్చింది. పాలసీదారుడికి ఎలాంటి ప్రమాదం జరిగినా బీమా తీసుకున్నప్పటి నుంచి ఏడాది పాటు కవరేజ్ వర్తిస్తుంది. 18 నుంచి 65 ఏళ్ల వయస్సు వారికి మాత్రమే ఇవి వర్తిస్తాయి. 2022 ఏప్రిల్‌లో తొలిసారిగా తపాలాశాఖ ప్రవేశ పెట్టింది. ఇప్పటికే సంగారెడ్డి డివిజన్‌లో అధిక సంఖ్యలో పాలసీలను తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా పోస్టాఫీసులో మరికొన్ని పథకాలు ఉన్నాయి. పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సుకన్య సమృద్ధి యోజన, కిసాన్ వికాస్ పత్ర, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ వంటి స్కీమ్‌లు ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా తక్కువ ప్రీమియంతో ఎక్కువ లాభాన్ని చేకూర్చే ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, మోటార్ బీమా పాలసీలను అందిస్తున్నాం. మీ గ్రామంలోని పోస్టాఫీస్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ద్వారా అన్ని సేవలను పొందవచ్చు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– శ్రీహరి, పోస్టల్ సూపరింటెండెంట్

కుటుంబ కలహాలతో మహిళ బలవన్మరణం

సంగారెడ్డి క్రైమ్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరేసుకొని మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని మంజీరా నగర్‌కు చెందిన పోతన వెంకట నాగలక్ష్మి, మనోహర్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురు గాయత్రీ (27)కి అదే పట్టణానికి చెందిన నాగరాజు అనే వ్యక్తితో 2017లో వివాహం జరుగగా గొడవలు వచ్చి 2021లో విడాకులు తీసుకున్నారు. వీరికి ఒక పాప ఉంది. తర్వాత గాయత్రీకి బోడుప్పల్ (హైద్రాబాద్) ప్రాంతానికి చెందిన అరుణ్ కుమార్ అనే వ్యక్తితో రెండో వివాహం జరిగింది. గాయత్రీ భర్తతో కలిసి సంగారెడ్డిలోనే తల్లి నాగలక్ష్మి ఇంట్లో ఉంటుంది. గాయత్రీ సాఫ్టవేర్ ఉద్యోగానికి రాజీనామా చేసి నెల కిందట పట్టణంలోని బైపాస్ ప్రాంతంలో గల లలిత ఆస్పత్రి పక్కన హోటల్ బిజినెస్ ప్రారంభించింది. తల్లి హార్ట్ పేషెంట్ కావడంతో ఆమె ఆరోగ్య విషయంలో 27న రాత్రి తల్లీకూతురు మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన గాయత్రీ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యానికి బానిసై ఉరేసుకొని వ్యక్తి

కొమురవెల్లి(సిద్దిపేట): మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బుధవారం ఎస్ఐ రాజు కథనం మేరకు.. చేర్యాల మండలంలోని కడవేర్గు గ్రామానికి చెందిన కొయ్యడ వెంకటేశ్(45) భార్య పద్మతో కలిసి కొంతకాలంగా కొమురవెల్లి గ్రామంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. కూలీ పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. ఏడాది కాలంగా మద్యానికి బానిసై డబ్బుల కోసం భార్యను వేధిస్తున్నాడు. ఇదే క్రమంలో మంగళవారం రాత్రి భార్యతో గొడవపడి గదిలోకి వెళ్లి గడియపెట్టుకున్నాడు. ఉదయం వరకు తలుపులు తీయకపోవడంతో ఇరుగు పొరుగు వారి సాయంతో బద్దలు కొట్టి చూడగా ఉరేసుకొని కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో దూకి యువకుడు



కృష్ణ (ఫైల్)

గజ్వేల్‌రూరల్: చెరువులో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని సింగాటంలో వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన అందోల్ నర్సయ్య–అంజమ్మకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కృష్ణ(26) ఉన్నారు. కృష్ణ కొద్ది రోజులుగా తూప్రాన్ పరిధిలోని ఓ విత్తన పరిశ్రమలో పని చేస్తున్నాడు. 26న సింగాటం గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో కలిసి ఆటోలో బయలుదేరిన కృష్ణ మార్గమధ్యలో పిడిచెడ్‌లో దిగాడు. సదరు వ్యక్తి సింగాటం రావా అని కృష్ణను అడుగగా తర్వాత వస్తానంటూ బదులిచ్చి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని సదరు వ్యక్తి కృష్ణ కుటుంబ సభ్యులకు చెప్పాడు. అతడి కోసం కుటుంబ సభ్యులు తెలిసిన చోట వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. బుధవారం గ్రామంలోని లింగం చెరువులో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గుర్తించిన గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. చెరువు కట్ట వద్ద బూట్లు, బ్యాగ్‌తో పాటు సెల్‌ఫోన్ ఉండగా మృతదేహాన్ని బయటకు తీసి కృష్ణగా గుర్తించారు. కృష్ణ పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉండటంతో కేసులకు భయపడి, మనోవేదనకు గురై చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రాంగ్ రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీకొట్టి

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు

కొండపాక(గజ్వేల్): బైక్‌ను రాంగ్ రూట్లో నడిపి మరొక బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల పరిధిలోని బొబ్బాయిపల్లికి చెందిన కన్నెమైన అశోక్, అతడి స్నేహితుడు రెడ్డమైన సుధాకర్ 26న ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం కుకునూరుపల్లికి వెళ్లారు. తిరుగొస్తుండగా కుకునూరుపల్లిలోని మంజీరా గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎదురుగా నెల్లూరు జిల్లాకు చెందిన షేక్ నయూబ్ రాంగ్ రూట్లో వస్తూ వీరి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అశోక్, సుధాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అశోక్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అశోక్ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు నయూబ్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కను తప్పించబోయి..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద బుధవారం చోటు చేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. మిర్జాపల్లి తండాకు చెందిన కాట్రోత్ రాజు(45) ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో పూరిగుడిసెను తొలగించి ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీంతో మిర్జాపల్లి రైల్వే స్టేషన్ కాలనీలో ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం ఇంటి నిర్మాణా పిల్లర్స్‌కు నీటిని పట్టేందుకు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై బయలుదేరాడు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్దకు రాగానే కుక్క అడ్డుగా రావడంతో తప్పించబోయి బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన హైట్‌గేజ్ పోల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య చాందీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు కబ్జా

చోద్యం చూస్తున్న నేషనల్ హైవే అధికారులు



జాతీయ రహదారి సర్వీసు రోడ్డును మట్టితో మూసివేసిన కబ్జా దారులు

తూప్రాన్: పట్టణంలోని 44వ జాతీయ రహదారిపై రైతులు, వాహనదారులకు అనుకూలంగా ఉండే సర్వీసు రోడ్డును కొందరు అక్రమార్కులు దర్జాగా కబ్జాకు పాల్పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలో 44వ జాతీయ రహదారి సుమారు 100 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. నాలుగు లైన్ల రహదారికి ఇరువైపుల సర్వీసు రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు రైతులతోపాటు కొన్ని ప్రాంతాల్లో వాహనదారులకు అనుకూలంగా పని చేస్తుంది. కానీ రహదారికి ఇరువైపుల అనేక చోట్ల హైవే అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా దర్జాగా సర్వీసు రోడ్డు కనిపించకుండ మట్టితో నింపివేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. రైతులు తమ సొంత పట్టా వ్యవసాయ భూముల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సర్వీసు రోడ్డును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంలో నేషనల్ హైవే అథారిటీ పీడీ శ్రీనివాస్‌రావును ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

వాయు కాలుష్యం.. దినదినగండం



పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి, వీరన్నగూడెం గ్రామాల ప్రజలు వాయుకాష్యయంతో సతమతమవుతున్నారు. ఈ ప్రాంతంలో పదుల సంఖ్యలో రసాయన పరిశ్రమలు ఉన్నాయి. గ్రాన్యూవిల్స్, మెట్రోకెంతోపాటు పలు పరిశ్రమలు నిబంధనలకు విరుద్ధంగా వాయు కాలుష్యాన్ని విచ్చలవిడిగా గాలిలోకి వదులుతున్నారు. దీంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం సాయంకాలం సమస్య మరింత తీవ్రస్థాయికి చేరడంతో శ్వాసకోస సంబంధిత సమస్యలతో బాధపడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. కాలుష్య సమస్యపై పీసీబీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా నామమాత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల స్థానిక నాయకులు కలెక్టర్ కార్యాలయంలో సైతం ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కళ చెదిరి.. కష్టాలు మిగిలి

- ఉపాధి కరువై పూట గడవని పరిస్థితుల్లో కళాకారులు
- తెలంగాణ సాధనలో కీలకపాత్ర
- ధూంధాం పాటలతో ఉద్యమానికి ఊపిరి
- సాంస్కృతిక సారథిలో నోచుకోని ఉద్యోగాలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 200 మంది



తెలంగాణ ఉద్యమ సమయంలో డప్పులతో దండోర వేస్తున్న కళాకారులు (ఫైల్)

జిన్నారం (పటాన్‌చెరు): తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలను ఉద్యమం వైపు మళ్లించి ధూందాం పాటలతో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని పాటల రూపంలో వినిపించారు. ఉద్యమాన్ని మరింత ఉద్రిక్తం చేసి తెలంగాణ సాధనకు కాలికి గజ్జెకట్టి ఆడిపాడిన కళాకారులకు నేడు ఆదరణ లేక కుటుంబ పోషణ భారంగా మారింది. స్వరాష్ట్రం ఏర్పడితే తమ కంటూ గుర్తింపు దక్కుతుందని కలలు కన్నారు. కానీ కళాకారులకు క్షేత్రస్థాయిలో గుర్తింపు దక్కలేదని వాపోతున్నారు.

తెలంగాణ సాంస్కృతిక సారథి ఏర్పాటు

తెలంగాణ ఉద్యమంలో గొంతెత్తి పాటలు పాడిన గాయకులను, డప్పు కళాకారులను అప్పటి ప్రభుత్వం గుర్తించి వారికి పెద్దపీట వేస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం చేయాలని తెలంగాణ సాంస్కృతిక సారథి ఏర్పాటు చేసి చైర్మన్‌గా రసమయి బాలకిషన్‌ను నియమించింది. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 550 మందికి ఉద్యోగాలు కల్పించింది. రెండో విడతలో మరింత మందికి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో తమ కష్టానికి ఫలితం దక్కిందని ఉద్యోగాలు వస్తాయని కళాకారులు సంతోషపడ్డారు. కానీ రెండో నోటిఫికేషన్ కోసం ఎదురుచూసిన కళాకారులకు నిరాశే ఎదురైంది.

200 మందిలో 30 మందికే ఉద్యోగాలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో 200 మంది ఉద్యమంలో పని చేసిన కళాకారులు ఉండగా అందులో కేవలం 30 మందికి మాత్రమే ఉద్యోగ అవకాశాలు దక్కాయి. మిగితా వారికి నిరాశే మిగిలింది. సారథిలో ఉద్యోగాలు పొందినవారిలో కొందరు ఉద్యమానికి సంబంధంలేని వారు ఉన్నారు. సారథిలో కొందరు వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ తమ వర్గానికి చెందిన వ్యక్తులకు అవకాశాలు కల్పించారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

ప్రభుత్వం గుర్తించాలి



తెలంగాణ ఉద్యమంలో గద్దర్, సాయి చంద్, రసమయి బాలకిషన్ వంటి ప్రముఖ గాయకుల పాటలకు డప్పు, డోలక్‌తో దరువేశాం. రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమ ధూంధాంలో పాల్గొన్నాం. రాష్ట్రం ఏర్పడితే బతుకులు మారుతాయనుకున్నాం. ప్రస్తుతం ఉపాధి లేక ఇల్లు గడవడం కష్టంగా ఉంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా గుర్తించి ఉద్యమ కళాకారులను ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

– డోలక్ రవి, డప్పు కళాకారుడు జిన్నారం

కళాకారులను ఆదుకోవాలి



కళను నమ్ముకొని బతుకుతున్న కళాకారుల జీవితాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పాటనే బతుకుగా మలుచుకొని జీవితాలను సాగిస్తున్న మాకు కళాకారుల కోటలో ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలి. గత ప్రభుత్వ హయాంలో సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు పొందిన వారు ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు ప్రై వేటు కార్యక్రమాల్లో పాల్గొంటూ మా బతుకులతో ఆడుకుంటున్నారు.

– బొంతపల్లి ఎల్లయ్య, జన చైతన్య కళా సంస్థ గాయకుడు

విద్యుదాఘాతంతో జీవాలు మృత్యువాత

మేసుకుంటూ వెళ్లి కరెంట్ వైరుకు తగిలి



మృత్యువాత పడిన ఆవు, గేదె

అల్లాదుర్గం(మెదక్): విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన అల్లాదుర్గం మండలం రెడ్డిపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు సాయికుమార్ ఆవు మేత మేసుకుంటూ పోతుంది. గ్రామ శివారులో గాలికి విద్యుత్ వైరు తెగి ఉండగా మేసుకుంటూ వెళ్లి ఆవు తగలడంతో మృత్యువాత పడింది. రూ.60 వేల వరకు నష్టం వాటిల్లిందని చెప్పారు. విద్యుత్ అధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

విద్యుత్ వైరు తెగిపడటంతో..

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండల పరిధి లింగోజిగూడ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు యాదయ్య రోజు మాదిరిగానే పాడి గేదెలను మేత కోసం వ్యవసాయ పొలాల వద్దకు తీసుకెళ్లాడు. కర్రల సహాయంతో ఉన్న విద్యుత్ వైరు తెగిపడి గేదెపై పడటంతో విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకుడు చింత స్వామి కోరారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక కళా ప్రదర్శన



ఐఐటీ కందిలో 10వ అంతర్జాతీయ సదస్సు

సంగారెడ్డి జోన్: ఐఐటీ హైదరాబాద్‌లో 10వ అంతర్జాతీయ సదస్సు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక కళా ప్రదర్శనలు ఆహుతుల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన తారాపాదరాజక్ బృందం సభ్యులు దేవి మహాత్మ్యం కథను ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ ప్రదర్శనలో దుర్గాదేవి మహిషాసురమర్దినిగా మారే ఘట్టం ఆహుతులు ఆధ్యాత్మిక తన్మయత్వానికి లోనయ్యారు.



కళా ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

పిడుగులు పడుతున్నాయ్ జాగ్రత్త

చనిపోతున్న జనాలు, జీవులు

- ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు
- అప్రమత్తత అవసరమంటున్న వాతావరణశాఖ అధికారులు



ఎన్కేపల్లి గ్రామంలో పిడుగుపాటుకు మృతి చెందిన మేకలు

సదాశివపేట(సంగారెడ్డి): వర్షాకాలం మొదలు కావడంతో పిడుగులు పడే అవకాశం అధికం, దీంతో జనాలు, జీవాలు మృత్యువాత పడతాయి. వాతావరణ మార్పుల దృష్ట్యా మే, జూన్ నెలల్లో పిడుగులు ఎక్కువగా పడే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

20 మేకలు మృత్యువాత

ఈ నెలలో కురిసిన అకాల వర్షాలకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పిడుగులు పడి ఇద్దరు మృతి చెందారని సమాచారం. ఏప్రిల్‌లో అకాల వర్షాలకు పిడుగు పడి మండలంలోని ఎన్కేపల్లి గ్రామంలో 20 మేకలు మృత్యువాత పడ్డాయి.మండలంలోని సిద్దాపూర్ గ్రామ శివారులో చెట్టుకింద నిలుచున్న ఐటీఐ విద్యార్థి మృతి చెందాడు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఎప్పుడు ఏ రకమైన వానలు కురుస్తున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలు కురిస్తే వాటితోపాటు ఉరుములు, మెరుపులు, పిడుగులు పడటం సహజంగా జరుగుతుంది. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు పిడుగుపాటుకు మరణిస్తున్నారు.

సమయస్ఫూర్తి అవసరం

వ్యవసాయ పనులు చేసేటప్పుడు ఉరుములు మెరుపులు వస్తుంటే పిడుగులు పడతాయని భావించి రైతులు అప్రమత్తం కావాలి. వెంటనే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. సురక్షిత ప్రాంతానికి వెళ్లే సమయం లేకుంటే సమయస్ఫూర్తితో వ్యవహరించి మోకాళ్లపై చేతులు తలపెట్టి దగ్గరగా ముడుచుకొని కూర్చోవాలి. సమీపంలో పిడుగుపడినా అందులో విద్యుత్ ప్రభావం తక్కువగా ఉండి ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.

జాగ్రత్తలు పాటించాలి

సాధారణంగా ఎత్తుగా ఉండే నిర్మాణాలు, ప్రాంతాలపై పిడుగులు ఎక్కువగా పడుతుంటాయి. అందువల్ల వర్షం కురిసే సమయంలో ఎత్తైన చెట్లు సెల్‌టవర్ విద్యుత్ స్తంభాలు కొండల వద్దకు వెళ్లకూడదు. టీవీలు రిఫ్రిజరేటర్లు, విద్యుత్ కుక్కర్లు ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు కంప్యూటర్లు ఇతర విద్యుత్ పరికరాల ఉపయోగించకూడదు. వర్షం కురిసినప్పుడు విద్యుత్ సరఫరాల్లో హెచ్చుతగ్గుల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా పొలాల్లో పనిచేయడం, పశువులు మేపడం వంటివి చేయకూడదు. చెరువు, ఈత కొలనులు వంటి బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదు.